నేడు రంగం

చిలకలగూడ : చిలకలగూడ కట్టమైసమ్మ నల్ల పోచమ్మ బోనాల జాతరలో కీలక ఘట్టమైన రంగం కార్యక్రమం సోమవారం సాయంత్రం 4 గంటలకు ఆలయ ప్రాంగణంలో నిర్వహించ నున్నారు. ఉప్పరిబస్తీకి చెందిన కుమ్మరి ఆంజ నేయులు వంశస్తులు రూపొందించిన పచ్చి కుండపై నిలబడి పాతబస్తీకి చెందిన మాతంగి లక్ష్మమ్మ భవిష్యవాణి వినిపిస్తుంది. ప్రజలు అడిగే పలు ప్రశ్నలకు తనదైన శైలిలో జవాబులు ఇస్తుంది.

వర్సిటీల సమస్యలను పరిష్కరించండి


డా.వేణుకుమార్

ఉస్మానియా యూనివర్సిటీ: రాష్ట్రంలోని వర్సిటీల సమస్యలను పరిష్కరించాలని ఏఐటీబీసీ జేఏసీ చైర్మన్ డా.అవ్వారు వేణుకుమార్ అన్నారు. ఆదివారం ఓయూలో జరిగిన పీహెచ్‌డీ పూర్తి చేసిన నిరుద్యోగుల సభలో ఆయన మాట్లాడారు. 13 ఏండ్లుగా ఉద్యోగాలను భర్తీ చేయనందున వర్సిటీలలో తీవ్రమైన అధ్యాపకుల కొరత ఉందని తక్షణం 3 వేల ఖాళీలను భర్తీ చేయాలని సీఎం రేవంత్‌రెడ్డిని కోరారు. వర్సిటీలకు బడ్జెట్ పెంచాలని, మౌలిక వసతులు పెంచాలని, ఉద్యోగాల భర్తీలో తక్కువ అధ్యాపకులు గల విభాగాలకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని ఆయన కోరారు. ఓయూలో అధికంగా బీసీ విద్యార్థులే చదువుతున్నారని పీహెచ్‌డీ ప్రవేశాలలో తగిన న్యాయం చేయాలని అధికారులను కోరారు.

బీసీ విద్యార్థుల పట్ల సవతి తల్లి ప్రేమ తగదు

ఉస్మానియా యూనివర్సిటీ: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం బీసీ విద్యార్థుల పట్ల సవతి తల్లి ప్రేమ చూపిస్తోందని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం ఆయన ఓయూలో మాట్లాడుతూ.. ఫీజుల పెంపు, ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించలేమని చెప్పడం, పాలిటెక్నికల్ కోర్సుకు రూ.14, 500 ఫీజును 39 వేలకు పెంచారని, ఫీజులను బీసీ విద్యార్థులలే భరించాలని తాజాగా ఉత్తర్వులు జారీ చేయడం అత్యంత దారుణమన్నారు. అన్ని సామాజిక వర్గాల విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను చెల్లిస్తూ కేవలం బీసీలకు ఫీజులు చెల్లించాలని ఉత్తర్వులు జారీ చేయడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. బీసీ మంత్రులు, ఎమ్మెల్యేలు బీసీల పక్షాన నిలబడి బీసీ విద్యార్థులకు న్యాయం చేయాలని లింగంగౌడ్ కోరారు.

కలుషిత నీరు.. ప్రజల బేజారు

మోండాలో నీటి కోసం ప్రజల ఇబ్బందులు

రాంగోపాల్‌పేట్: మోండా డివిజన్ సెకండ్‌బజార్‌లో ప్రజలు కలుషిత నీటితో ఇబ్బంది పడుతున్నారు. కొద్ది నెలలుగా నల్లాల్లో కలుషిత నీరు సరఫరా అవుతుండటంతో వాటిని తాగలేక నీటిని కొనుగోలు చేసి దాహం తీర్చుకుంటున్నారు. జైహింద్ బేకరీ ఎదురుగా ఉండే గల్లీలో ఈ పరిస్థితి నెలకొంది. రెండు రోజులకు ఒక మారు రెండు గంటల పాటు నీరు సరఫరా అవుతోంది. అయితే లోప్రెషర్‌తో కలుషిత జలాలు సరఫరా అవుతున్నాయి. మూడు నెలలుగా ఈ సమస్య నెలకొంది. స్థానికులు పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. సెక్షన్ మేనేజర్‌తో పాటు మారేడుపల్లి జీఎం వినోద్ దృష్టికి తీసుకు వెళ్లినా కనీసం ఒక్కరంటే ఒక్కరు కూడా వచ్చి చూసిన పాపాన పోలేదు. ఈ నెల 18న ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేయగా 3535 టోకెన్ నంబర్ ఇచ్చారు.విచిత్రమేమంటే ఎవరూ వచ్చి కనీసం చూడకుండానే సమస్య పరిష్కారమైందని మెసేజ్ రావడంతో జలమండలి పనితీరు ఎలా ఉందో అర్థం చేసికోవచ్చని స్థానికులు విమర్శిస్తున్నారు. కింది స్థాయి అధికారుల నుంచి జీఎం స్థాయి అధికారికి ఎప్పుడు ఫోన్ చేసినా బిజీ అంటూ మెసేజ్ చేయడం తప్పా ఏ ఒక్క రోజు ఆయన ప్రజల సమస్యల గురించి పట్టించుకోడనే విమర్శలు ఉన్నాయి. అలాగే ఏ రోజు కార్యాలయంలో అందుబాటులో ఉండకపోవడంతో పాటు ఫోన్‌లకు సమాదానం ఇవ్వరనే విమర్శలున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి సెకండ్‌బజార్‌లో కలుషిత జలాల సమస్య తీర్చాలని స్థానికలు కోరుతున్నారు.

ఘనంగా చెస్ డే వేడుకలు



చెస్ డే వేడుకల్లో క్రీడాకారులు

శ్రీనగర్‌కాలనీ: జూబ్లీహిల్స్‌లోని ఏకాగ్ర చెస్ అకాడమీలో ఆదివారం ఇంటర్నేషన్ చెస్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఏకాగ్ర చెస్ క్రీడాకారులు కేక్ కట్‌చేసి శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఏకాగ్ర చెస్ అకాడమీ చిన్నారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ చాటారని అత్యంత పిన్న వయస్కుడిగా మూడున్నర సంవత్సరాల రిషి చెస్‌లో తన సత్తా చాటుతున్నాడని అకాడమీ సీఈఓ సందీప్‌నాయుడు తెలిపారు.

అమ్మకు ప్రణమిల్లి..


పద్మారావునగర్‌లోని మావురాల ఎల్లమ్మ దేవాలయంలో బోనాల వేడుకలు

తెలంగాణ సంస్కృతికి ప్రతీకగా నిలిచే బోనాల వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. సికింద్రాబాద్, సనత్‌నగర్, కంటోన్మెంట్ నియోజకవర్గాల్లో కన్నుల పండువగా జరుపుకున్నారు. మహిళలు భక్తిపూర్వకంగా దేవాలయాల్లో అమ్మవారికి బోనాలు సమర్పించారు. బోనాల వేడుకల్లో అధికారులు ,ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొని ప్రత్యేకపూజలు చేశారు.


చిలకలగూడ కట్టమైసమ్మ ఆలయం వద్ద బోనాల సందడి





అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పిస్తున్న దేవదాయశాఖ ముఖ్య కార్యదర్శి శైలజారామయ్యర్, స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, ఎమ్మెల్యే పద్మారావు గౌడ్


ఉచిత మంచినీటి ప్యాకెట్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే పద్మారావుగౌడ్


సీతాఫల్‌మండి కార్పోరేటర్ సామల హేమ


సనత్‌నగర్‌లో అమ్మవారిని దర్శించుకున్న వెల్లాల రామ్మోహన్..


సనత్‌నగర్ హనుమాన్ దేవాలయంలో కార్పొరేటర్ కొలను లక్ష్మీబాల్‌రెడ్డి..


బేగంపేట ప్రకాష్‌నగర్లో కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు


కట్టమైసమ్మ బస్తీలో ఆలయంలో పూజలో పాల్గొన్న గజ్జెల నాగేష్ తదితరులు


రసూల్‌పురా నల్లపోచమ్మ ఆలయంలో పూజలో పాల్గొన్న బోర్డు మాజీ ఉపాధ్యక్షులు సదా కేశవరెడ్డి


పూజలో పాల్గొన్న భక్తులు



బోయిన్‌పల్లిలో..


పికెట్‌లో ఎంపీ ఈటల రాజేందర్


బేగంపేటలో అమ్మవారిని దర్శించుకున్న కార్పొరేటర్ మహేశ్వరిశ్రీహరి..


పోచమ్మ అమ్మవారికి బోనం తీసుకెళ్తున్న టీపీసీసీ ఉపాధ్యక్షురాలు కోట నీలిమ


టీఆర్‌టీ కాలనీలో..


ఉప్పలమ్మ సమేత విజయదుర్గ దేవాలయంలో ఎమ్మెల్యే టీ.పద్మారావుగౌడ్


మాణికేశ్వర్‌నగర్‌లో డిప్యూటీ మేయర్ శ్రీలతశోభన్‌రెడ్డి


పూజల్లో పాల్గొన్న మాజీ కార్పోరేటర్ శేషకుమారి


సుభాష‌నగర్‌లో..


అడ్డగుట్టలో బోనాల ఊరేగింపు


మధురానగర్‌లో..


అమ్మవారి పూజలో గెజిటెడ్ ఆఫీసర్స్ అసోషియేషన్ జిల్లా అధ్యక్షుడు కృష్ణయాదవ్

అమ్మవారికి వెండి కిరీటాలు అందజేత



సనత్‌నగర్: బేగంపేట శ్యాంలాల్ బిల్డింగ్స్‌లోని శ్రీనల్లపోచమ్మ, దుర్గాదేవి ఆలయానికి రూ.2 లక్షల విలువైన రెండు వెండి కిరీటాలు, శతగోపాన్ని యాదవ సంఘం ప్రతినిధి యాదగిరి యాదవ్ అందజేశారు. కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారికి సమర్పించారు.

గోరింటాకు సంబురం..

సనత్‌నగర్: ఆషాఢమాసంలో జరిగే సంప్రదాయ గోరింటాకు పండుగను సనత్‌నగర్ జెక్ కాలనీలోని వాసవీ ఇంద్రప్రస్థా అపార్ట్‌మెంట్‌వాసులు ఘనంగా జరుపుకున్నారు. గోరింటాకు పండుగను సంప్రదాయబద్ధంగా అమ్మవారికి పూజలు నిర్వహించి జరుపుకున్నారు. దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ ఎస్.అన్నపూర్ణ హాజరయ్యారు.



సమయం లేదు మిత్రమా..!

బంజారాహిల్స్: అసలే ఇరుకు గల్లీలు..ఆపై సమయం లేదు.. రాకుంటే ఫీలవుతారేమోనని భయం.. ఉన్న సమయంలోనే నియోజకవర్గం మొత్తం చుట్టి రావాలనే తాపత్రయం..ఇంకేముంది ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ ఇరుకు గల్లీల్లో తన కారు వెళ్లదు కాబట్టి స్కూటర్‌ను ఆశ్రయించారు. ఆదివారం తెల్లవారుజాము నుంచే నియోజకవర్గంలోని బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, వెంకటేశ్వరకాలనీ, సోమాజీగూడ, ఖైరతాబాద్, హిమాయత్‌నగర్ డివిజన్ల పరిధిలో బోనాల పండుగను పురస్కరించుకుని అమ్మవారి ఆలయాలకు బైక్‌పై రయ్..రయ్ అంటూ వెళ్లారు. నియోజకవర్గంలోని పలు అమ్మవారి ఆలయాల్లో ఆయన బోనాల పూజలు నిర్వహించారు. మొక్కులు తీర్చుకున్నారు. పిలిచిన వారందరి దగ్గరికి వెళ్లి అమ్మవారి సన్నిధిలో అర్చక స్వాములు ఆశీస్సులు తీసుకున్నారు. ఖైరతాబాద్ నియోజకవర్గంలోని చాలా గల్లీల్లోకి కారులో వెళ్లాలంటే కుదరకపోవడమే కాకుండా సమయం కూడా ఉండదు. దీంతో ఆయన బైక్‌పై అన్ని ప్రాంతాలను చుట్టొచ్చారు.



వానొస్తే నరకమే..!

- చెరువులను తలపిస్తున్న రోడ్లు
- అవస్థలు పడుతున్న లష్కర్‌వాసులు

బన్సీలాల్‌పేట్: వర్షం వస్తేచాలు..రోడ్లపైకి నీళ్లు.. మృత్యు ముఖాల్లా తెరుచుకున్న డ్రైనేజీ మ్యాను హోళ్లు..ఎక్కడికక్కడ గంటల కొద్దీ ట్రాఫిక్ జామ్ వంటి సమస్యలు లష్కర్‌లో ఆవిష్కృతమవుతున్నాయి. ఇటీవల కురుస్తున్న వర్షం సికింద్రాబాద్ ప్రజలను ఆతులాకుతులం చేసింది. వరద నీటి ప్రవాహం..ట్రాఫిక్ ఇబ్బందులతో ప్రజలు నరకయాతన అనుభవిస్తున్నారు. వర్షానికి మోకాలులోతు వరకు వరదనీరు వచ్చి చేరడంతో వాహనచోదకులు..పాదచారులు పడ్డ అవస్థలు అన్నీ ఇన్నీ కావు. ముఖ్యంగా లోతట్టు ప్రాంతాల ప్రజలు వరదనీటి కారణంగా అనేక ఇక్కట్లకు గురవుతున్నారు. వర్షం కురిసింది కొద్దిసేపే అయినా రోడ్లన్నీ జలమయమవుతున్నాయి.

- పద్మారావునగర్ ప్రధాన రహదారిలోని దండు నివాసం ముందు, రాణిగంజ్ ముంబాయి హోటల్ సమీపంలోని రోడ్డు, బన్సీలాల్‌పేట్, బోయిగూడ వై జంక్షన్, పద్మారావునగర్ ప్రధాన రహదారిలోని సాయికిరణ్ అపార్టుమెంట్ ముందు, సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ ముందు, ఓలిపెంటా బ్రిడ్జి, ఓల్డ్‌బోయిగూడ, లాలాగుడి, చాచానెహ్రూనగర్ ప్రాంతాల రోడ్లు జలమయంగా మారుతున్నాయి.

గంటల తరబడి ప్రజలు నరకయాతనను చవిచూడాల్సి వచ్చింది.

- ఇటీవల కురిసిన వర్షాకాలకు ఆర్పీరోడ్డు బైబిల్‌హౌస్ సమీపంలోని రైల్వే బ్రిడ్జి కింద పెద్ద ఎత్తున వరదనీరు వచ్చి చేరింది. కింగ్స్‌వే, సిటీలైట్, బాటా, కర్బలామైదాన్, బైబిల్ హౌస్ రోడ్డులో పెద్ద ఎత్తున ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. మహంకాళి ట్రాఫిక్ పోలీసు ఇన్‌స్పెక్టర్ రఘునాథ్ పోలీసు సిబ్బంది, హైడ్రా సిబ్బందితో కలిసి సహాయ చర్యలు చేపట్టి పరిస్థితిని చక్కదిద్దడం కనిపించింది.
- వర్షం వచ్చినప్పుడు వరదనీటితో ప్రజలు ఇబ్బంది పడుతున్నా జీహెచ్‌ఎంసీ అధికారులు మాత్రం తాత్కాలిక చర్యలతో కాలం గడుపుతున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. శాశ్వత పరిష్కారానికి అధికార యంత్రాంగం తీసుకుంటున్న చర్యలు శూన్యం.


ఆర్పీ రోడ్డు బైబిల్ హౌస్ రైల్వే బ్రిడ్జి కింద పెద్ద ఎత్తున వరదనీరు (ఫైల్)

- రోడ్లకు ఇరువైపులా వరదనీరు పావడానికి ఏర్పాటు చేసిన క్యాచ్‌పిట్లు చెత్తాచెదారం మట్టితో నిండిపోవడంతో వరదనీరు ముందు వెళ్ల లేక రోడ్లపైనే ఉంటున్నాయి.
- వర్షం వచ్చిందంటే సికింద్రాబాద్ గాంధీ ఆసుపత్రి ఎదురుగా పౌర సరఫరాల గోడౌన్ సమీపంలోని రోడ్డుపై పెద్ద ఎత్తున వరదనీరు వచ్చి చేరుతోంది.
- వర్షాకాలానికి ముందు జీహెచ్‌ఎంసీ, జలమండలి అధికారులు మాన్‌సూన్ ప్రణాళికల పేరిట హడావుడి తప్ప ఆచరణలో ఆ దిశగా ముందుకు సాగడం లేదనేది వాస్తవం.

లక్షలు వెచ్చిస్తున్నా...

వర్షాకాలంలో వరదనీటి కారణంగా ప్రజలు ఇబ్బంది పడకుండా జీహెచ్‌ఎంసీ, జలమండలి తరపున లక్షలు ఖర్చు చేస్తున్నారు. ఇందు కోసం ప్రత్యేక మాన్‌సూన్ వాహనాలు, సిబ్బందిని ఏర్పాటు చేసి లక్షలు ఖర్చు చేస్తున్నారు. అయితే సమస్య ఉత్పన్నమైనప్పుడు సదరు సిబ్బంది స్పందించడం లేదు. కాంట్రాక్టర్లు పనులు చేయకున్నా కాగితాలపై రాతలతో లక్షలాది రూపాయల బిల్లులను క్లెయిమ్ చేసుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.



సహాయ చర్యల్లో ట్రాఫిక్ పోలీసులు, హైడ్రా సిబ్బంది

వరదనీటి సమస్యలపై చర్యలు : డిప్యూటీ కమీషనర్ డాకు నాయక్

వరదనీటి సమస్యల కారణంగా ప్రజలు ఇబ్బంది పడకుండా చర్యలు తీసుకుంటున్నామని జీహెచ్‌ఎంసీ బేగంపేట్ సర్కిల్ డిప్యూటీ కమీషనర్ డాకు నాయక్ చెప్పారు. సర్కిల్ పరిధిలో ఎక్కడ కూడా రోడ్లపై వరదనీరు నిలువకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఇప్పటికే ఇంజనీరింగ్ విభాగం అధికారులను ఆదేశించామన్నారు. పనుల్లో జాప్యం, నిర్లక్ష్యం జరిగితే వెంటనే తమ దృష్టికి తీసుకువస్తే సదరు కాంట్రాక్టర్, అధికారులపై చర్యలు తీసుకుంటామన్నారు.